## ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ ఉండదా..?

- అధికారులు తీరు మార్చుకోవాలి
- వివక్ష చూపుతున్న కాంగ్రెస్
- ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, జనవరి 10 : అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, వారిపై చట్టపరమైన చర్య లు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సదాశివపేటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తనకు ప్రొటోకాల్ ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ప్రొటోకాల్ లేని వ్యక్తులకు అధికారులు ప్రొటోకాల్ ఇవ్వడం ఎంటని ప్రశ్నించారు. ప్రజలతో ఎన్నికైన వారికి ప్రొటోకాల్ వర్తించదా అని అధికారుల తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఇలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించలేదని, కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కావాలనే ప్రొటోకాల్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారెంటీలకు తన సహకారం ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ ఆర్థికంగా బలపడిన విషయం ప్రజలకు తెలుసన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల రూ.లక్ష నగదు పంపిణీతోపాటు తులం బం గారం అందజేస్తామన్న హామీని నిలుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులు, కౌలురైతులకు ఏడాదికి ఎకరానికి రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభు త్వం చెప్పిందన్నారు. రైతు రుణమాఫీ రూ.2లక్షలను సత్వరమే అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. వందరోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హెచ్చరించారు.

### జాతీయ యువజనోత్సవానికి 'తారా' విద్యార్థి



పవన్‌గౌడ్, తారా కళాశాల విద్యార్థి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే జాతీయ యువజనోత్సవానికి తారా ప్రభుత్వ కళాశాల బీఎస్సీ ద్వితీ య సంవత్సరం విద్యార్థి పవన్‌గౌడ్ ఎంపికయ్యాడు. బుధవారం విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అభినందించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 16వ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహిం చే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్ధులు, శివదీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

న్యాల్‌కల్, జనవరి 10: పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నృపేన్‌చక్రవర్తి అన్నారు. బుధవారం మండలంలోని రేజింతల్, హద్నూర్ గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో పరిసరాల శుభ్రత, ఆరోగ్య, పోషక విలువలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు కూరగాయలు, పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధులు సోకితే ఆరోగ్యకేంద్రాల్లో వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్యామల, మల్లికార్జున్, విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## రైతుబంధు డబ్బులు జమ చేయాలి

జహీరాబాద్, జనవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులు వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉమ్మడి జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు డబ్బులు వేస్తామని ప్రకటించినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఎకరం భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతుబంధు డబ్బులు జమ చేశారన్నారు. మిగతా రైతులకు వెంటనే డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్ (బి) గ్రామంలో ఉన్న ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యజమాన్యం రైతులకు వెంటనే పెండింగ్‌లో ఉన్న డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధిష్టానం కోరితే జహీరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తాన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, బీజేపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, ఆడివన్న, శివరాజ్ పాటిల్, విజేందర్‌రెడ్డి, వైద్యనాథ్, బుచిరెడ్డి, అఫ్సర్ దీల్‌దార్ పాల్గొన్నారు.

## నమ్మించారు... హత్యచేశారు

జిన్నారం, జనవరి 10 : ఐదు నెలల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి హత్యకు గురయ్యాడు. పాతకక్షల నేపథ్యంలో సొంత గ్రామానికి చెందిన వారే నమ్మించి ఖాజీపల్లి అటవీ ప్రాంతంలో హత్య చేశారు. అస్తిపంజరం ఖాజీపల్లి అటవీ ప్రాంతంలో కల్వర్టు కింద లభించింది. ఘటనా స్థలాన్ని సంగారెడ్డి ఎస్పీ రూపేశ్, డీఎస్పీ పురుషోత్తం బుధవారం పరిశీలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కుషనగర్ జిల్లా సేకూయి గ్రామానికి చెందిన బ్రిజేష్ గోస్వామి(26) ఆరు నెలలుగా బొల్లారం మున్సిపాలిటీలోని పోచమ్మ బస్తీలో నివాసం ఉంటూ హైడ్రాల్ వెహికిల్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత సంవత్సరం ఆగస్టు 6వ తేదీన సాయంత్రం బ్రిజేష్ గోస్వామి కనిపించకుండా పోయాడు. చుట్టు పక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య ఆర్తిదేవి బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంగారెడ్డి సీసీఎస్‌తో కలిసి కేసును పరిశోధించారు. ఈ కేసులో అనుమానితుడైన రాజన్‌ను విచారించగా, అసలు విషయం బయటపడింది. సొంత గ్రామానికి చెందిన అజయ్, సీతు, రాజన్, విజయ్, బంధువులు కలిసి పాత కక్షలతో బ్రిజేష్ గోస్వామిని ఖాజీపల్లి అటవీలోకి పిలిపించి హత్య చేశారు. ఘటనా స్థలాన్ని సంగారెడ్డి ఎస్పీ రూపేశ్, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తం, బొల్లారం సీఐ నయిమొద్దీన్‌తో కలిసి పరిశీలించారు. మృతుడి బంధువులు బట్టలను చూసి బ్రిజేష్‌గోస్వామి మృతదేహమేనని నిర్ధారించారు. హంతకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



సిర్గాపూర్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబురాలు జరుపుకొన్నారు. టీచర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు రంగుల రంగవల్లికలను వేశారు. **– సిర్గాపూర్, జనవరి 10**



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

# తప్పుల్లేని జాబితాను రూపొందించాలి

- 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- డూప్లికేట్ ఓటర్లపై దృష్టి సారించాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- చిన్న చిన్న సమస్యలకు కుంగిపోవద్దు
- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- సమయాన్ని సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని చేరుకోవాలి
- సంగారెడ్డి అదనపు ఎస్పీ అశోక్

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 10 : ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా స్పష్టమైన, తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి ఆర్వోలు, ఏఈఆర్వోలతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 22 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. ఫారం-7, ఫారం-8ల పరిశీలన పూర్తి చేసి ఆన్‌లైన్ పూర్తి కావాలన్నారు. ఈఆర్వోలు డూప్లికేట్ ఓటర్లపై దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అన్ని వివరాలు అందించాలని పేర్కొన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో నగేశ్, ఐదు నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

**25లోగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి**

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 10 : వానకాలం, యాసంగి 2022-23సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని ఈ నెల 25లోగా పూర్తి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి రైస్‌మిల్లర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సివిల్ సప్లైస్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లతో గత సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైస్ మిల్లులకు ఈఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకు బియ్యం నిల్వలు అందించేలా రైస్ మిల్లర్లు సహకరించాలన్నారు. ఈ నెల 25లోగా సీఎంఆర్ డెలివరీ చేయాలని ఆదేశించారు. సీఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యాన్ని చేరుకొని మిల్లర్లపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాంటి వారిపై 6ఏ కింద కేసులు బుక్ చేస్తామని, మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడంతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. 2022-23 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమిషన్‌ను 10 రోజుల్లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఎస్‌వో వనజాత, సివిల్ సప్లై డీఎం సుగుణబాయ్, రైస్ మిల్లర్లు, డీఆర్డీవో శ్రీనివాసరావు, కాంట్రాక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

**విద్యార్థులు ధైర్యంగా ఉండడం నేర్చుకోవాలి**

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 10 : విద్యార్థులు చదువుల్లో రాణించాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు, వికలాగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత, తారా ప్రభుత్వ కళాశాల మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తారా కళాశాల సెమినార్ హాల్‌లో బేటీ బచావో - బేటీ పడావో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నేటి సమాజంలో చిన్న చిన్న సమస్యలకే విద్యార్థులు కృంగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు గుర్తు చేస్తూ చిన్నపాటి సమస్యలను బయటికి చెప్పుకోలేక తనువు చాలించడం బాధాకరమన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కా రానికి అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. అదనపు ఎస్పీ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించు కొని ఉన్న సమ యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సక్సెస్ స్టోరీలను చదవాలని, కష్టకాలాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలనే పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో వివిధ రంగాల్లో రాణించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో, తారా కళాశాల పూర్వ విద్యార్థి ఎల్లయ్య, జిల్లా యువజన, క్రీడల అధికారి రామచందర్‌రావు, తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, డీడబ్ల్యూవో సంధ్యారాణి, డీసీపీవో రత్నం, యువజనోత్సవ కన్వీనర్ సుమతి, కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మనోజ్ కుమార్, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్దులు, శివదీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్ణాటక మార్కెట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బృందం



కర్ణాటకలోని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బృందం

పటాన్‌చెరు, జనవరి 10 : పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వెళ్లిన బృందం కర్ణాటకలోని యశ్వంత్‌పూర్, చిక్‌బళ్లాపూర్ మార్కెట్లను పరిశీలించింది. బుధవారం కర్ణాటక రాజధాని బెంగళూరుకు సమీపంలోని యశ్వంత్‌పూర్, చిక్‌బళ్లాపూర్ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. అధికారులు ఎమ్మెల్యే బృందానికి మార్కెట్ల విశేషాలను వివరించారు. మార్కెట్ కమిటీల పాత్ర, రైతులకు కల్పించిన సదుపాయాలు, క్రయ విక్రయమాలు, దుకాణాల కేటాయింపుపై చర్చించారు. పటాన్‌చెరు మార్కెట్ ఏర్పాటు, ఇతర వివరాలను వారికి వివరించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర స్థాయికి 23 ఎగ్జిబిట్లు ఎంపిక

**బహుమతులు ప్రదానం చేసిన సంగారెడ్డి ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 10 : మూడు రోజులుగా స్థానిక సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 782 ఎగ్జిబిట్లు ఈ ప్రదర్శనలో పాల్గొనగా, 23 ఎగ్జిబిట్లను ఉత్తమ ఎగ్జిబిట్లుగా ఎంపిక చేయగా, ఆయా ఎగ్జిబిట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక్ ప్రదర్శినిలో హెల్త్, లైఫ్ సైకిల్ ఫర్ ఎన్విరాన్మెంట్, అగ్రికల్చర్, కమ్యూనికేషన్ ఆండ్ ట్రాన్స్పోర్ట్, కంప్యూటేషనల్ తింకింగ్ అనే ఐదు ఉప అంశాలకు సంబందించిన ఎగ్జిబిట్లను విద్యార్థులు ప్రదర్శించారు. ఆయా ఎగ్జిబిట్లలో మొత్తం 23 ఎగ్జిబిట్లను ఉత్తమ ఎగ్జిబిట్లుగా న్యాయనిర్ణేతలు తేల్చారు.

ముగింపు వేడుకలకు ఎస్పీ చెన్నూరి రూపేశ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై ఉత్తమ ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్, సేయింట్ ఆంథోనీఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్ రెడ్డి, మండల విద్యాధికారి వెంకట నర్సింహులు, వివిధ కమిటీల కన్వీనర్లు, విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



ఉత్తమ ఎగ్జిబిట్ అవార్డు పొందిన విద్యార్థులతో సంగారెడ్డి ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## హెచ్‌ఎండీఏ పరిధిలో అక్రమ కట్టడాలు కూల్చివేత

బొల్లారం, జనవరి 10 : బొల్లారం మున్సిపాలిటీ హెచ్‌ఎండీఏ పరిధిలోని అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్, హెచ్‌ఎండీఏ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. బుధవారం శ్రీరామ్‌నగర్ కాలనీ శివారులోని హెచ్‌ఎండీఏ సర్వేనంబర్ 254/1 స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఇండ్లను కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో అధికారులు, స్థానికులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒకదశలో హెచ్‌ఎండీఏ అధికారులు, మున్సిపల్ శాఖకు చెందిన జేసీబీ డ్రైవర్‌పై రాళ్ల దాడికి యత్నించారు. కోర్టు నుంచి తమకు అనుమతులు ఉన్నాయని చెప్పడంతో కొద్ది సేపు కూల్చివేతలు నిలిపివేశారు. అనంతరం కోర్టు పత్రాలు పరిశీలించిన అనంతరం రెండు ఇండ్లను కూల్చివేసారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రయ్య, హెచ్‌ఎండీఏ సైట్ ఆఫీసర్ రమణారెడ్డి, సెక్యూరిటీ గార్డు సంపత్‌కుమార్, నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**చర్చి కూల్చివేతతో ఉద్రిక్తత**

సర్వే నెంబర్ 278లో నిర్మాణ దశలో ఉన్న చర్చిని హెచ్‌ఎండీఏ అధికారులు కూల్చివేశారు. దీంతో క్రైస్తవులు హెచ్‌ఎండీఏ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బొల్లారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట సుమారు గంటన్నర రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు జోక్యం చేసుకుని నిరసన కారులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.



జేసీబీకి అడ్డు తగిలి కూల్చివేతలు అడ్డుకుంటున్న స్థానికులు

**జిన్నారంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత**

జిన్నారం, జనవరి 10 : జిన్నారం శివారులోని సర్వేనంబర్ 1002 ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి కూల్చివేశారు.

1002 సర్వేనంబర్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ రవికుమా ర్ ఆదేశాల మేరకు ప్రహరీ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేసినట్లు ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ తెలిపారు. ఇటీవల జిన్నారం శివారులో ఏర్పా టు చేసిన వైన్స్ కూడా సర్వే నంబర్ 1002లోకే వస్తుందని, దీనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆర్ఐని ప్రశ్నించారు.

### గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలి

సంగారెడ్డి, జనవరి 10: ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న కల్లుగీత కార్మికులందరికీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతికి గీత కార్మిక సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న టీఎఫ్‌టీ లైసెన్స్‌లను వెంటనే ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, నాయకులు కృష్ణాగౌడ్, గణేశ్‌గౌడ్ ఉన్నారు.

### చెరుకు బకాయిలు రైతులకు ఇప్పించండి

సంగారెడ్డి, జనవరి 10: జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారంపై చర్యలు తీసుకుని చెరుకు రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని, గానుగ ప్రారంభించాలని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతికి తెలంగాణ రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రైతాంగం ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని నమ్ముకుని 11వేల హెక్టార్లలో దాదాపు 8500మంది రైతులు చెరుకు పంట సాగు చేస్తున్నారన్నారు. చెరుకు బకాయిలు రైతులకు చెల్లించి గానుగ ప్రారంభించేందుకు చర్యలు తీసుకువాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

### చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కంది, జనవరి 10 : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు సూచించారు. మండలంలోని కాశీపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ హింస, బాల్యవివాహాల నిషేధం, పోక్సో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

### వేంకటేశ్వర స్వామి ఆలయం ధ్వంసం

జిన్నారం, జనవరి 10 : మండలంలోని మంగంపేట గ్రామంలోని సర్వేనంబర్ 55లోని పలుగు గుట్టపై ఉన్న పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయం ధ్వంసమైంది. పరిశ్రమ ఏర్పాటుకు టీఎస్ఐఐసీ ద్వారా స్థలం పొందిన పరిశ్రమ యాజమాన్యం ఫెన్సింగ్ పనులు చేపట్టారు. కాగా ఈ క్రమంలోనే ఆలయాన్ని ధ్వంసం చేసినట్లుగా గ్రామస్తులు తెలిపారు. 55/3 సర్వేనంబర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయం పేరున రెండు గుంటల స్థలం ఉందని సర్పంచ్ ప్రశాంతీనరేందర్ తెలిపారు. ఆలయం ధ్వంసం అయినట్లు తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వచ్చి పరిశీలించారు. ఆలయం ధ్వంసం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సర్పంచ్, ఉపసర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునస్వామికి, ఎస్సై విజయరావుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆలయ ధ్వంసంపై గురువారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పోలీసుల దాడులు

పటాన్‌చెరు, జనవరి 10 : రుద్రారం గ్రామ పరిధిలో గీతం యూనివర్సిటీ వెళ్లే దారిలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బెల్ట్‌షాపులపై సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మద్యం బాటిళ్లు లభించాయి. అనుమతులు లేకుండా బెల్ట్ షాపులు నడుపుతున్న షాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ గీతం ఇంజినీరింగ్ కళాశాల పరిసర ప్రాంతా ల్లో అక్రమంగా నడుపుతున్న బెల్ట్‌షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారన్నారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని కళాశాలలు, పాఠశాలల వద్ద అనుమతులు లేకుండా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గీతం కళాశాల సమీపంలో అక్రమంగా మద్యం అమ్మడం, నిషేధిత సిగరెట్లు అమ్ముతున్నారని సమాచారంతో దాడులు చేసి ఏడుగురిని అరెస్టు చేసి కోర్టుకు పంపించామన్నారు.

### జిల్లాస్థాయిలో విద్యార్థి

గుమ్మడిదల, జనవరి 10 : జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జడ్పీహెచ్ఎస్ బొంతపల్లి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాంబాబు తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు సంగారెడ్డి జిల్లా సెయింట్ అంథోనీస్ హైస్కూల్‌లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో 782 ఎగ్జిబిట్స్‌లను ప్రదర్శించగా, బొంతపల్లి జిల్లా పరిషత్‌లో 9వతరగతి చదువుతున్న భద్ర ప్రదర్శించిన పోర్టబుల్ ఎయిర్ కూలర్‌కు అత్యుత్తమ ఎగ్జిబిట్‌గా ఎంపిక చేశారని తెలిపారు. ఎగ్జిబిట్‌కు సహకరించిన సైన్స్ టీచర్లు శ్రీనివాస్, అజీముద్దీన్‌తో పాటు విద్యార్థి భద్రను డీఈవో అభినందించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

### చతుర్దశి వేడుకలు

కోహీర్, జనవరి 10 : మండలంలోని కవేలి గిరిజా సమేతా మహాలింగ సంగమేశ్వరాలయంలో బుధవారం చతుర్దశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి బిల్వార్చన, రుద్రాభిషేకం, కుంకుమార్చన, మహామంగళమారతి, అన్నపూజ చేశారు. అనంతరం పలు మండలాలకు చెందిన కళాకారులు ఆలపించిన కీర్తనలు, భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంగమేశ్వరాలయ ఆవరణలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాములు, శ్రీనివాస్, మురళి, రాచన్న పాల్గొన్నారు.

### పంటల సాగుకు సహకారం

జిన్నారం, జనవరి 10 : మాదారం పంచాయతీలో రైతులు పంటల సాగు చేసుకునేందుకు అవసరమైన నీటిని అందించేందుకు నియోజన పరిశ్రమ ముందుకొచ్చింది. సుమారు రూ. 5లక్షల సీఎస్ఆర్ నిధులతో పంచాయతీ పరిధిలో ఆరు బోర్లను బుధవారం వేయించింది. సర్పంచ్ సరితాసురేందర్‌గౌడ్ వార్డు సభ్యులు, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి భూమిపూజ చేసి బోర్లు వేయించారు. ఈ సందర్భంగా సర్పం చ్ పరిశ్రమ యాజమాన్యం, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్లాంట్ మేనేజర్ నరేశ్, వార్డు సభ్యులు భగవాన్‌సింగ్, భాస్కర్ పాల్గొన్నారు.

### బస్తీలో కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం, జనవరి 10 : ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 8వ బ్లాక్‌లో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం 13వ బ్లాక్‌లో సుమారుగా రూ.30 లక్షలతో జరుగుతున్న యూజీడీ పనులను పరిశీలించారు. ఆమె వెంట కాలనీవాసులు శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, నర్సింహ, మహేందర్‌రెడ్డి, నయీమ్, బాసిత్, ఎర్రమల్లి, ప్రవీణ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఉన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, జనవరి 10 : మండలంలోని ర్యాకల్ గ్రామానికి చెందిన ఎలిమెల రుక్కమ్మ ముదిరాజ్ మృతిచెందగా, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఓదార్చారు. కుటుంబానికి అండంగా ఉంటామని ధైర్యం ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, గ్రామ అధ్యక్షుడు సాయాగౌడ్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

### బీరంగూడలో కారు బీభత్సం

రామచంద్రాపురం, జనవరి 10 : ఆర్సీపురం డివిజన్ బీరంగూడ కమాన్ వద్ద కారు బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటకు చెందిన ఇన్నోవా క్రిస్టా కారు డ్రైవర్ నవీన్‌కుమార్ బీరంగూడ కమాన్‌లో ఉన్న హైటెక్ బావర్చి హోటల్ సమీపంలో ఉన్న యూటర్న్ వద్ద కారు బ్రేక్‌కు బదులు ఎక్స్‌లేటర్‌ని అప్లై చేశాడు. దీంతో ఒక్కసారిగా కారు స్పీడ్ అందుకొని జాతీయ రహదారిపై వెళ్తున్న మూడు స్కూటీలను ఢీకొట్టుకుంటూ డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న సుమబిందుతో పాటు మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ మేరకు సుమబిందు భర్త పామర్తిశ్యామ్ ఫిర్యాదు మేరకు ఎస్సై శశికాంత్‌రెడ్డి కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదంలో వ్యక్తి మృతి

కోహీర్, జనవరి 10 : 65వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై విఠల్ వివరాల ప్రకారం.. కోహీర్ పట్టణానికి చెందిన శేఖర్ (29) రంజోల్ గ్రామంలోని అత్తగారింటికి తన బైక్‌పై వెళ్తుండగా దిగ్వాల్ 65వ జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు జహీరాబాద్ వైపునకు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. దీంతో శేఖర్ తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి సత్యమ్మ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

### సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

హత్నూర, జనవరి 10 : విధినిర్వహణలో భాగంగా వార్త సేకరణకు వెళ్లిన విలేకరులపై దుర్భాషలాడుతూ దాడిచేసిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు విలేకరులు ప్రభాకర్, వెంకటేశం గౌడ్, భిక్షపతి తెలిపారు. మండలంలోని తాహెర్ఖాన్‌పేట శివారులో గల వాటర్ ప్లాంట్ వద్ద తాము ఫొటోలు తీస్తుండగా సర్పంచ్ చంద్రాగౌడ్ తన అనుచరులతో వచ్చి దుర్భాషలాడి దాడిచేసినట్లు ఆరోపించారు. విలేకరులపై దుర్భాషలాడుతూ దాడి చేసిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.